

జన కేతనం
- కాంగ్రెస్ కంచుకోటలో ప్రాంతీయ పార్టీల హవా
- ఆదర్శనీయులు ఆ ఇద్దరు
- గేలి చేసినా... గెలిచారు
-7లో

చప్పగా జగన్ రోడ్ షో

జనాన్ని తరలించేందుకు వైసీపీ అభ్యర్థుల తిప్పలు

- పురుషులకు రూ.300, మహిళలకు రూ.200 చొప్పున పంపిణీ
- అభివాదం/నమస్కారం చేస్తూ ముందుకుసాగిన ముఖ్యమంత్రి
- అభివాదాలతోనే ముగిసిన ప్రచారం



విశాఖ నగర పరిధిలోని నాయుడుతోట ప్రాంతంలో జగన్ బస్సు యాత్రలో కనిపించని జనం

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): **ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదివారం విశాఖలో నిర్వహించిన రోడ్‌షో చప్పగా సాగింది. జనాలు పెద్దగా లేకపోవడంతో ఆయన రోడ్డుపక్కన, దుకాణాల వద్ద నిలబడిన వారికి బస్సులో నుంచే నమస్కారం చేసుకుంటూ ముందుకువెళ్లాల్సి వచ్చింది. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసినప్పుడు, 2019 ఎన్నికల ప్రచార సమయంలో జగన్మోహన్‌రెడ్డికి నగరంలో మంచి స్పందన కనిపించింది. అయితే ఈసారి వాతావరణం అందుకు విరుద్ధంగా కనిపించిందని ఆ పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు.**



మద్దిలపాలెం ప్రాంతంలో జగన్ బస్సు యాత్ర

అనకాపల్లి జిల్లాలో శనివారం రోడ్‌షో, 'మేమంతా సిద్ధం' సభలో పాల్గొన్న జగన్ రాత్రి సబ్బవరం మండలం చిన్నయ్యపాలెం వద్ద గల టెరాకాన్ లేఅవుట్‌లో బస చేశారు. ఆదివారం అక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.50 గంటలకు నగర పరిధిలోని వేపగుంట జంక్షన్‌కు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం సీఎం బస్సు యాత్ర ఉదయం తొమ్మిది గంటలకే వేపగుంట జంక్షన్‌కు చేరాల్సి ఉండగా...దాదాపు నాలుగు గంటలు ఆలస్యం అయ్యింది. దీంతో ఆటోల్లో వైసీపీ నేతలు తరలించిన మహిళలు, వృద్ధులు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేపగుంట జంక్షన్‌లో బస్సు మీద నిలబడి ప్రజలకు అభివాదం చేసిన జగన్ ఆ తర్వాత లోనికి వెళ్లిపోయారు. నాయుడుతోట జంక్షన్ వరకూ జనాలు లేకపోవడంతో రోడ్డుపై రాకపోకలు సాగించేవారికి, దుకాణాల ముందు నిలబడి వున్నవారికి నమస్కరిస్తూ వెళ్లారు. మధ్యాహ్నం 1.20 గంటలకు గోపాలపట్నం పెట్రోల్‌బంక్ వద్ద భోజన విరామం తీసుకున్నారు. తిరిగి 3.45 గంటలకు బస్సు యాత్ర ప్రారంభించారు. ఎన్ఏడీ జంక్షన్ మీదుగా కరాస, మర్రిపాలెం, కంచరపాలెం మెట్టు, దొండపర్తి, అక్కయ్యపాలెం, మద్దిలపాలెం, హనుమంతవాక జంక్షన్ మీదుగా పీఎం పాలెంలోని ఎంవీవీ సిటీకి చేరుకుని రాత్రి బస చేశారు.

ఈ సందర్భంగా బస్సు యాత్ర సాగిన మార్గంలో పలుచోట్ల జనాలు కనిపించకపోవడం వైసీపీ వర్గాలు నిరుత్సాహానికి గురయ్యాయి. గోపాలపట్నం, ఎన్ఏడీ జంక్షన్, కంచరపాలెం మెట్టు, అక్కయ్యపాలెం, ఇసుకతోట వంటిచోట్ల ఒక మాదిరిగా జనాలు ఉన్నప్పటికీ...వారంతా ఆయా నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు ఆటోలు పెట్టి తీసుకువచ్చినవారే కావడం విశేషం. ఇందుకుగాను పురుషులకు రూ.300, మహిళలకు రూ.200 చొప్పున ఇచ్చారు. తూర్పు నియోజకవర్గంలో అయితే రోడ్‌షోకు వచ్చిన వారందరికీ కూపన్‌లు ఇచ్చి కార్యక్రమం పూర్తయిన తర్వాత వచ్చి రూ.500 తీసుకోవాలని సూచించారు. కొన్నిచోట్ల రోడ్‌షో అయిపోయిన వెంటనే వైసీపీ టోపీ, టీషర్టు ధరించిన వ్యక్తులు సమీపంలోని మద్యం దుకాణానికి వెళ్లి మద్యం కొనుగోలు చేసుకోవడం కనిపించింది. జగన్ రోడ్‌షో సందర్భంగా నగరంలో చాలాప్రాంతాల్లో ఉదయం నుంచే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. అలాగే జగన్ బస్సు ... మిగతా 8వ పేజీలో

టీడీపీ అభ్యర్థులకు బీ ఫారాలు



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చేతుల మీదుగా బీఫారాలు అందుకున్న చింతకాయల అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనిత, కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి

అనకాపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీడీపీ నుంచి పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులకు పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం అమరావతిలోని ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో బీ ఫారాలు అందజేశారు. ముందుగా అధిష్ఠానం నుంచి పిలుపునందుకున్న జిల్లాకు చెందిన నేతలు ముందురోజే అమరావతి చేరుకున్నారు. నర్సీపట్నం అసెంబ్లీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట అసెంబ్లీ అభ్యర్థి వంగలపూడి అనిత, చోడవరం అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తికి బీఫారాలను చంద్రబాబు అందజేశారు. అనంతరం రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పని చేయాలని వారితో చంద్రబాబు ప్రమాణం చేయించారు.

బండారుకే మాడుగుల

- బీ ఫారం అందించిన టీడీపీ అధినేత చంద్రబాబు
- పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం



బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, ఏప్రిల్ 21: టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తికి మాడుగుల అసెంబ్లీ టికెట్ ఖరారు కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నుంచి ఆయన ఆదివారం బీఫారం తీసుకోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. మాడుగుల నియోజకవర్గం టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, ఎన్ఆర్ఐ పైలా ప్రసాదరావు ఆశించిన విషయం తెలిసిందే. అయితే పార్టీ అధిష్ఠానం ఒక దశలో ఎన్ఆర్ఐ పైలా ప్రసాదరావుకి టికెట్ ఖరారు చేసింది. పార్టీ ఆశించిన స్థాయిలో ప్రసాదరావు.. నాయకులు, కార్యకర్తలను ఆకట్టుకోలేకపోవడంతో పాటు ఇక్కడ జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా పలు సర్వే రిపోర్టులు తెప్పించుకుని చివరి క్షణాల్లో పార్టీ అధిష్ఠానం బండారు సత్యనారాయణమూర్తిని తెర మీదకు తీసుకొచ్చింది. బండారుకు టికెట్ ఖరారు చేయడంతో గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్ మద్దతు ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఉత్సాహంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు.

లెక్చరర్ ఆత్మహత్య



ఉమాదేవి (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 21: **పట్టణానికి ఆనుకుని ఉన్న శారదానగర్ ముత్రాసికాలనీలో ఓ లెక్చరర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనికి సంబంధించి పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గుత్తికొండ నూకరాజు ముత్రాసికాలనీలో భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తె ఉమాదేవి(32)కి గుండాల జంక్షన్ ప్రాంతానికి చెందిన రాజేశ్‌తో 2011లో వివాహమైంది. కొంతకాలం తరువాత వారు విడాకులు తీసుకున్నారు.**

తన కష్టంపై జీవించాలనే ఉద్దేశంతో చదువులో రాణించిన ఉమాదేవికి ఏపీఆర్‌జేసీ స్కూల్‌లో ఇంగ్లీషు టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. అనతికాలంలోనే ఏపీఆర్‌జేసీలో లెక్చరర్‌గా పదోన్నతి రావడంతో విజయనగరం జిల్లా తాటిపూడిలో ఉద్యోగం చేస్తున్నారు. కాగా వేసవి సెలవులు కావడంతో ముత్రాసికాలనీలోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. తండ్రి నూకరాజు వ్యాపార నిమిత్తం విజయరామరాజుపేటలోని కిరాణా దుకాణానికి వెళ్లారు. శనివారం రాత్రి సమయంలో తల్లి, సోదరుడు వేర్వేరు పనులపై బయటకు వెళ్లారు. రాత్రి పదిన్నర గంటల సమయంలో తండ్రి ఇంటికి వచ్చారు. తలుపులు వేసి ఉండడం, ఎంత పిలిచినా లోపల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో కిటికీ రెక్క తీసి చూశారు. ఇంట్లో రక్తం కనిపించడంతో వెనుక తలుపు గడియను అతి కష్టం మీద తీసి లోపలకి వెళ్లేసరికి ఉమాదేవి తన గొంతును కత్తితో కోసుకుని తీవ్ర రక్తస్రావంతో మృతి చెంది ఉంది. వెంటనే తండ్రి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. అదే సమయంలో వచ్చిన మృతురాలి తల్లి, సోదరుడు కన్నీరుమున్నీరుగా విలపించారు. విడాకుల తరువాత ఉద్యోగం చేసుకుంటున్న ఉమాదేవికి పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులు సంబంధాలు చూసినా కుదరకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చనని లేదా మరే కారణాల వల్ల అయినా ఈ సంఘటనకు పాల్పడి ఉండొచ్చనని అభిప్రాయపడుతున్నామని సీఐ శంకరరావు చెప్పారు. అయితే సంఘటనకు ఉపయోగించిన కత్తిని సీజ్ చేశామని, అలాగే ఆమె సెల్‌ఫోన్ కూడా సీజ్ చేసి దాని ద్వారా ఏమైనా ఆధారాలు లభిస్తే ఆ పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతురాలి తండ్రి నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఆయన తెలిపారు.

భగ్గుమన్న భానుడు



సండది లేని సబ్బవరం మెయిన్‌రోడ్డు

నాతవరంలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

అనకాపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. జిల్లాలోనే నాతవరంలో 43.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో 24 మండలాలకుగాను 10 మండలాల్లో 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుచ్చెయ్యపేట 43.5 డిగ్రీలు, దేవరాపల్లి 42.3, రోలుగుంట 42.3, సబ్బవరం 42, మునగపాక 41.9, కొంకోట 41.7, చీడికాడ 41.6, రావికమతం 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండు రోజుల పాటు ఇదే విధంగా ఎండల తీవ్రత ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

పరవాడలో..

పరవాడ: మండలంలో ఎండ తీవ్రతకు జనం అల్లాడిపోయారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపడంతో బయటకు రావడానికి వెనకంజ వేశారు. ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా కనిపించాయి. నిత్యం రద్దీగా ఉండే పరవాడ నుంచి అనకాపల్లికి వెళ్లే ప్రధాన రహదారులు బోసిపోయాయి.



నిర్మానుష్యంగా ఉన్న కోటవురట్ల జంక్షన్

సబ్బవరంలో..

సబ్బవరం: మండలంలో ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం చూపించింది. రైతులు, వ్యవసాయ కూలీలు రోజువారీ పనులు చేసుకునేందుకు అవస్థలు ... మిగతా 8వ పేజీలో

లోకాయుక్త ఆదేశాలు బేఖాతరు

మార్కెట్ దుకాణాల కేటాయింపుల్లో అవకతవకలపై ఫిర్యాదు

- కేటాయింపులు రద్దు చేయాలని 2017లో కోర్టు ఆదేశాలు
- పట్టించుకోని అధికారులు, పాలకవర్గం
- రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి

నర్సీపట్నం, ఏప్రిల్ 21: **మార్కెట్ దుకాణాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, వాటిని రద్దు చేస్తున్నట్టు లోకాయుక్త ఆదేశాలు జారీ చేసినా మండల పరిషత్ అధికారులు బేఖాతరు చేశారు. ఇందిరా మార్కెట్లోని దుకాణాల కేటాయింపులు రద్దు చేయాలని 2017 సంవత్సరంలో లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలను పెడచెవిన పెట్టారు. ఆరు నెలల్లోపు కోర్టు ఆదేశాలు అమలు చేయని పక్షంలో కోర్టు ధిక్కరణకు వస్తుందని లోకాయుక్త న్యాయమూర్తులు హెచ్చరించినా మండల పరిషత్ అధికారులు, పాలకవర్గం పట్టించుకోలేదు. షాపుల కేటాయింపులు రద్దు చేసి వేలం పాట ద్వారా అద్దెకు ఇచ్చి ఉంటే మండల పరిషత్‌కు ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయం వచ్చేది. కానీ వారి ఉదాసీన వైఖరి వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది.**

సుమారు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో నర్సీపట్నం నడిబొడ్డున అబీద్ సెంటర్‌లో ఇందిరా మార్కెట్ ఉంది. మార్కెట్లో 132 పక్కా దుకాణాలు ఉన్నాయి. వాటిలో 72 పాత షాపులు, 2007లో నిర్మించిన కొత్త దుకాణాలు 60 ఉన్నాయి. రేకుల షెడ్లు, పాకలు, బడ్డీలు కలిపి మరో 60 షాపులు ఉన్నాయి. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వేలంపాట నిర్వహించకుండా కొత్తగా నిర్మించిన 60 షాపులు వారికి కావలసిన వ్యక్తులకు కేటాయించారు. దుకాణాల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని సామాజిక కార్యకర్త కె.శివనారాయణరాజు లోకాయుక్తకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం పాట నిర్వహించకుండా నామమాత్రపు అద్దెకు దుకాణాలు కేటాయించారని పేర్కొన్నారు. దీనిపై లోకాయుక్త విచారణ కమిటీ ఇందిరా మార్కెట్‌ను సందర్శించి పూర్తి స్థాయిలో విచారణ జరిపింది. దుకాణాల కేటాయింపుల్లో అవకతవకలు జరిగిన విషయం వాస్తవమేనని విచారణ కమిటీ లోకాయుక్తకు నివేదిక ఇచ్చింది. దీంతో అవకతవకలు పాల్పడిన ఎంపీడీవో, ఎంపీపీ మీద చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి లోకాయుక్త కోర్టు 2013లో ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో శివనారాయణరాజు మరోసారి లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. అప్పటికి ఎంపీడీవో మరణించడం, ఎంపీపీ పదవిలో లేకపోవడంతో ఇందిరా మార్కెట్ దుకాణాలు కేటాయింపులు రద్దు చేయాలని 2017 సంవత్సరంలో లోకాయుక్త ఆదేశాలు జారీ చేసింది. ఆరు నెలల్లోపు దుకాణాల కేటాయింపులు రద్దు చేయకపోతే కోర్టు ధిక్కరణ కింద పరిగణిస్తామని లోకాయుక్త హెచ్చరించింది. అయితే మండల పరిషత్ అధికారులు లోకాయుక్త ఆదేశాలను ఏడేళ్లుగా అమలు చేయకపోవడం విమర్శలకు దారి తీస్తున్నది. దుకాణాల లీజుదారులకు నోటీసులు ఇచ్చి ... మిగతా 8వ పేజీలో



పాతబస్టాండ్ రోడ్డులో పక్కా దుకాణాలు

లోకాయుక్తకు లిఖిత పూర్వకంగా తెలియజేశా..

ఇందిరా మార్కెట్ దుకాణాల కేటాయింపులు రద్దు చేయాలని 2017 సంవత్సరంలో లోకాయుక్త కోర్టు ఇచ్చిన ఆదేశాలను మండల పరిషత్ అధికారులు పట్టించుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే గణేశ్ మార్కెట్‌ను మునిసిపాలిటీలో విలీనం చేస్తామని చెప్పారు. విలీనం చేస్తే దుకాణాలు వేలం వేస్తారని అనుకున్నాను. కానీ విలీనం చేయకపోవడంతో మండల పరిషత్ అధికారులు చర్యలు తీసుకోలేదని ఆరు నెలల క్రితం లోకాయుక్తకు లిఖిత పూర్వకంగా తెలియజేశాను.

- కె.శివనారాయణరాజు, సామాజిక కార్యకర్త, నర్సీపట్నం

సాగునీటి వనరులపై నిర్లక్ష్యం

వైసీపీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం

- ఐదేళ్ల క్రితం మరమ్మతులకు గురైన సర్పానది ఏటి కాలువ గ్రోయిన్ గేట్లు
- పూడుకుపోయిన సాగునీటి కాలువ
- సుమారు 800 ఎకరాలకు నీరు అందక రైతుల ఇక్కట్లు



కాలువలో కూరుకుపోయిన గేటు

మాకవరపాలెం, ఏప్రిల్ 21: వైసీపీ అధికారంలోకి వచ్చాక సాగునీటి వనరులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గ్రోయిన్ల గేట్లు మరమ్మతులకు గురైనా, సాగునీటి కాలువలు పూడుకుపోయినా పట్టించుకోవడం లేదు. మాకవరపాలెం సర్పానది ఏటి కాలువ గ్రోయిన్ గేట్లు మరమ్మతులకు గురై ఐదేళ్లు కావస్తున్నా ... మిగతా 8వ పేజీలో



బి ఫారాల స్వీకరణ

టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నుంచి బి ఫారాలు తీసుకుంటున్న చింతకాయల అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం), బండారు సత్యనారాయణ మూర్తి (మాడుగుల), వంగలపూడి అనిత (పాయకరావుపేట), కేఎస్ఎన్ఎస్ రాజు (చోడవరం)

- ఆంధ్రజ్యోతి, అనకాపల్లి

కూటమి అధికారంలోకి రాగానే పద్మశాలీల సమస్యలను పరిష్కరిస్తాం

» అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ హామీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 21: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పద్మశాలీల సమస్యలను పరిష్కరిస్తామని అనకాపల్లి బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ హామీ ఇచ్చారు. ఆదివారం కూటమి ఆధ్వర్యంలో పద్మశాలీలు, దేవాంగ, చేనేత సమాజ ఆత్మీయ సమావేశం ప్రైవేటు హోటల్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. పోలవరం, రాజధాని నిర్మాణం, విశాఖ ఉక్కు కర్మాగారం, రైల్వేజోన్ వంటి సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థుల గెలుపు ఎంతో ముఖ్యమైనదన్నారు. అనంతరం కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం మరలా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, దాడి రత్నాకర్, పొన్నగంటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైవాడ జలాశయంలో అడవి దున్న మృతి



జలాశయం రెగ్యులేటింగ్ గేట్ల సమీపంలో మృతి చెంది ఉన్న అడవి దున్న

దేవరాపల్లి, ఏప్రిల్ 21: ఓ అడవి దున్న మండలంలోని రైవాడ జలాశయం రెగ్యులేటింగ్ గేట్ల సమీపంలో మృతిచెంది కనిపించింది. జలాశయానికి వెళ్లిన పర్యాటకులు ఆదివారం సాయంత్రం దీనిని గుర్తించారు. ఎండల తీవ్రత కొనసాగుతుండడంతో పాటు అటవీ ప్రాంతంలో పచ్చదనం కరువవుతోంది. దీంతో రాత్రి వేళ మేత కోసం దిగిన ఈ అడవి దున్న తాగు నీటి కోసం వచ్చి ఊబిలో చిక్కుకుని మృతిచెంది ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుంటే, పెదబురగ, చింతపాక, దిబ్బపాలెం, వీరభద్రపురం పరిసర ప్రాంతాల్లో ఈ అడవి దున్నలు సంచరిస్తున్నట్టు గిరిజనులు చెపుతున్నారు. ఇటీవల వీటిని గుర్తించేందుకు అమరావతి నుంచి చీఫ్ కన్జర్వేటర్ ఇక్కడకు వచ్చి వెళ్లారు. అడవి జంతువులు ఇలా మృత్యువాత పడకుండా పరిరక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా జంతు ప్రేమికులు కోరుతున్నారు.

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం



బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 21 : ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ప్రారంభమైన రెండో ఆదివారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే భక్తులు కుటుంబసమేతంగా ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులకు చల్లటి తాగునీటిని ఆలయ అధికారులు పంపిణీ చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చల్లటి మజ్జిగను భక్తులకు అందజేశారు. ఆలయ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల తోటల్లో భక్తులు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి కుటుంబసభ్యులంతా భోజనాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అంబేడ్కర్ కాలనీలో తాగునీటి సమస్య

» రెండు రోజులుగా నిలిచిన కొళాయిల ద్వారా నీటి సరఫరా



తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న అంబేడ్కర్ కాలనీ మహిళలు

పాయకరావుపేట, ఏప్రిల్ 21 : స్థానిక అంబేడ్కర్ కాలనీలో గత రెండు రోజులుగా పంచాయతీ కొళాయిల ద్వారా తాగు నీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం ఇంట్లో వాడుక నీరు కూడా లేకపోవడంతో దూర ప్రాంతం నుంచి తెచ్చుకుంటూ అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న రైల్వే వంతెన అవతల ఉన్న అంబేడ్కర్ కాలనీ ప్రజలకు ఇందిరాకాలనీలో ఉన్న మినీ వాటర్ ట్యాంక్ నుంచి తాగునీరు సరఫరా అవుతోంది. అయితే కొంతకాలంగా కొళాయిల నుంచి చిన్న ధారగా తాగునీరు వస్తుండడంతో తాగునీటి కోసం కాలనీవాసులు అధిక సమయం కేటాయిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో రెండు రోజులుగా కొళాయిల నుంచి పూర్తిగా నీరు రాక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆదివారం పక్క కాలనీలోని చేతిపంపుల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదివారం కాలనీకి చెందిన పి.లక్ష్మి, ఎ.సత్యవతి, పి.చంద్రమ్మ, షేక్ షాయది, పి.కళ తదితరులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి నీటి సరఫరా చేయాలని కోరారు.

కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇద్దాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బత్తుల



సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 21: జిల్లాలో కూటమి అభ్యర్థులను గెలిపించి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు కానుకగా ఇవ్వాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడుగా తాతయ్యబాబు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడుగా ఉన్న బుద్ద నాగజగదీశ్వరరావు జిల్లా అధ్యక్ష బాధ్యతలను తాతయ్యబాబుకు అప్పగించారు. అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో తాతయ్యబాబు మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసే కార్యకర్తకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని తన నియామకమే ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. పార్టీ గుర్తుల విషయంలో నియోజకవర్గాల వారీగా పార్లమెంట్‌కు కమలం గుర్తు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసేనకు గాజుగ్లాస్, టీడీపీకి సైకిల్ గుర్తులను ఓటర్లకు వివరించాలని సూచించారు. ఈనెల 24న బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమానికి అతిథిగా వచ్చిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి ఏపీకి పట్టిన శని పోయేలా చూడాలన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి రావడం తథ్యమన్నారు. తాను 30 ఏళ్లగా టీడీపీలో పనిచేశానని, పార్టీలో పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించి చంద్రబాబుకు గిఫ్టుగా ఇవ్వాలన్నారు. తాతయ్యబాబుకు తానెప్పుడూ తోడుగా ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. తొలుత బత్తుల తాతయ్యబాబు, బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్‌లను సీఎం రమేశ్ సత్కరించారు. తాతయ్యబాబును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రత్నాకర్ సన్మానించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తాతయ్యబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పప్పల చలపతిరావు, పీలా గోవింద సత్యనారాయణ, గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, లాలం కాశీనాయుడు, కోట్ని బాలాజీ, కొణతాల వెంకటరావు, గూనూరు మల్లునాయుడు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపట్టిన తాతయ్యబాబును సత్కరించి నూకాంబిక చిత్రపటాన్ని అందిస్తున్న నాగజగదీశ్వరరావు

కాపు సామాజిక భవనం పూర్తయ్యేదెన్నడో...?

టీడీపీ హయాంలో వడ్డాదికి రూ.50 లక్షలతో మంజూరు

- » నలభై శాతం నిర్మాణాన్ని పూర్తిచేసిన కాంట్రాక్టర్
- » అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో మంజూరు కాని బిల్లులు
- » ఐదేళ్ల పూర్తికావస్తున్నా ఎక్కడి పనులు అక్కడే!



వడ్డాదిలో అసంపూర్తిగా నిలిచిన కాపు సామాజిక భవనం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 21 : మండలంలోని వడ్డాది గ్రామంలో కాపు సామాజిక భవనం నిర్మాణం ఐదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయింది. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చోడవరం నియోజకవర్గంలోని వడ్డాది, కొత్తకోట, చోడవరంలలో ఒక్కోకాపు సామాజిక భవన నిర్మాణానికి రూ.50 లక్షలు చొప్పున మొత్తం రూ.1.5 కోట్లను మం జూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఈ మూడు సామాజిక భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. టెండరు ఖరారు కావడంతో 2019లో సదరు కాంట్రాక్టర్ తొలుత వడ్డాదిలో ఈ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. శ్లాబ్ స్థాయి వరకు నలభైశాతం నిర్మాణం పనులు జరగడంతో సుమారు రూ.20లక్షల బిల్లు పెట్టారు. అయితే ఈ దశలో టీడీపీ ప్రభుత్వం మారి, వైసీపీ అధికారంలోకి వచ్చింది. 35 శాతం జరగని కాపు సామాజిక భవనాల నిర్మాణ పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో కొత్తకోట, చోడవరానికి భవనాల టెండర్లు రద్దయ్యాయి. వడ్డాదిలో ఈ భవన నిర్మాణం 35శాతం పైబడి జరగడంతో రద్దు కాలేదు. అయితే వైసీపీ ప్రభుత్వం బిల్లులను మాత్రం విడుదల చేయలేదు. బిల్లు మంజూరు చేయాలని సదరు కాంట్రాక్టర్ ఐదేళ్లుగా అధికారులు, పాలకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకపోయింది. దీంతో వడ్డాదిలో సదరు భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాల్సిందిగా అంతా కోరుతున్నారు.

మరిడి మహాలక్ష్మి పండగ రేపు

నేటి రాత్రి పెద్ద జాగరణ.. గరగల ఊరేగింపు

- » భారీ ఏర్పాట్లు చేపడుతున్న నిర్వాహకులు
- » అమ్మవారికి ఆభరణాలు అలంకరణ
- » పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నర్సీపట్నం, ఏప్రిల్ 21 : పట్టణంలో మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరగనుంది. నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి పెద్ద జాగరణ నిర్వహించనున్నారు. ఇదిలావుంటే, ఆదివారం అమ్మవారికి ఆభరణాలను అలంకరించారు. మహిళలు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా ఆలయం వద్ద క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి పెద్ద జాగరణను పురస్కరించుకుని స్టేజీ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేశారు. కృష్ణాబజార్ కూడలిలో రేలా రే రేలా, అబీద్ సెంటర్‌లో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, స్వామి అయ్యప్ప గుడి వద్ద ఆర్కెస్ట్రా, ఎస్‌కేపీటీ సెంటర్‌లో డ్యాన్స్ హంగామా వంటి వాటిని ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసు ఆంక్షలు విధించినందున సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి ఏడు నుంచి పది గంటల వరకు మాత్రమే జరుగుతాయి. ఆ తరువాత పెద్ద జాగరణ ఆరంభమై, తెల్లవార్లూ గరగలను ఊరేగిస్తారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు నెమలి డ్యాన్స్, శక్తివేషాలు, నేల డ్యాన్స్‌లు, గరగల డాన్స్ నమో వెంకటేశాయ వేషధారణ వంటి ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. మంగళవారం పండగ రోజున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

పునఃప్రారంభానికి నోచుకోని రైతుబజార్

- » పట్టించుకోని పాలకులు, అధికారులు
- » నష్టపోతున్న రైతులు వినియోగదారులు
- » షెడ్లు వద్ద పెరిగిన తుప్పలు
- » రోడ్లపైనే కూరగాయల విక్రయాలు



తుప్పల మధ్య ఉన్న మినీ రైతుబజార్

ఎలమంచిలి, ఏప్రిల్ 21: రైతు ప్రభుత్వమని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న పాలకులు నియోజకవర్గ కేంద్రంలో మినీ రైతుబజార్ పునఃప్రారంభానికి నిర్లక్ష్యం వహిస్తున్నారు. రైతుబజారు కారణంగా అటు రైతులకు ఇటు వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎలమంచిలి పట్టణంలో పదేళ్ల క్రితం ప్రారంభించిన రైతుబజార్ మున్నాళ్ల ముచ్చటగానే మారిపోయింది. రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు దళారుల చేతిలో పడకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించి గిట్టుబాటు ధర దక్కేందుకు, వినియోగదారులకు సరసమైన ధరలకే తాజా సరుకులు దక్కేందుకు ఇక్కడ రైతుబజార్‌ను ఏర్పాటుచేశారు. ప్రారంభంలో రైతుబజార్‌కు ఎస్.రాయవరం మండలం నుంచి రైతులు వ్యసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయించేవారు. దీంతో రైతుబజార్ కళకళలాడేది. అనంతరం రైతుబజార్‌ను కొందరు కావాలని నిర్వీర్యం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ప్రస్తుతం రైతుబజార్ తుప్పల మధ్య కునారిల్లుతున్నది. ఒకవిధంగా చెప్పాలంటే రైతుబజార్ ఆనవాళ్లు లేకుండా పోయింది. రైతులు కూడా రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. రైతుల పక్షాన నిలిచి రైతుబజార్‌ను పునఃప్రారంభించేందుకు అటు పాలకులు గాని, అధికారులు గాని ప్రత్యేక దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి రైతాంగానికి, వినియోగదారులకు ఉపయోగకరంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రధాన రోడ్డు పక్కన ఆకుకూరలను విక్రయిస్తున్న మహిళ

క్రైం... crime news

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

అచ్యుతాపురం, ఏప్రిల్ 21: రామన్నపాలెంలో విద్యుదాఘాతంతో ధర్మిరెడ్డి శ్రీను (42) మృతి చెందాడని సీఐ బుచ్చిరాజు తెలిపారు. కొత్తగా నిర్మించిన షాపులో విద్యుత్ వైరింగ్ చేస్తుండగా షాక్ తగిలి శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రైవేటు ఉద్యోగి మృతి

అచ్యుతాపురం, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని జంగులూరు జంక్షన్ వద్ద గల సిరిపురం గార్డెన్స్‌లో ఒక వ్యక్తి మృతి చెందినట్టు సీఐ బుచ్చిరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.జంగులూరు జంక్షన్ వద్ద గల సిరిపురం గార్డెన్స్‌లో వెలిశెట్టి సాయి కుమార్ (33) సొంత ప్లాట్‌లో భార్య, ఇద్దరు పిల్లలతో నివాస ముంటున్నాడు. సాయికుమార్ సెజ్‌లో గల ఒక ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తున్నాడు. ఇటీవల భార్య త్రివేణి పుట్టింటికి వెళ్లింది. త్రివేణి శుక్రవారం నుంచి భర్తకు ఫోన్ చేస్తోంది.. ఫోన్ ఎత్తడం లేదు. దీంతో ఆమె తమ సహచరులకు విషయం చెప్పగా, వారు శనివారం సాయంత్రం ఇంటికి వెళ్లి చూసేసరికి సాయి కుమార్ చనిపోయి ఉన్నాడు. ఈమేరకు సాయికుమార్ భార్య త్రివేణి ఆదివారం ఫిర్యాదు చేశారని సీఐ బుచ్చిరాజు తెలిపారు. మృతికి కారణం తెలియదని, కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం చేయించామన్నారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత : ఇద్దరి అరెస్టు

కొత్తూరు, ఏప్రిల్ 21 : అక్రమంగా ఆరు కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి. తేజేశ్వరరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం తనకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో అనకాపల్లి మండలం పిసినికాడ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కశింకోట వైపు కాలినడకన వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి ఉందన్నారు. బ్యాగులో ఉన్న 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని తమిళనాడు రాష్ట్రం విల్లిపురం జిల్లా యుల్లిందర్‌పేట్ మండలం విల్లుపురం గ్రామానికి చెందిన కాశీనాథ్ ప్రకాష్, బాలకృష్ణన్ జగదీష్ అరెస్టు చేశామని ఆయన చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

నాలుగు మద్యం ఫుల్ బాటిళ్లు స్వాధీనం

పరవాడ, ఏప్రిల్ 21: తానాం గ్రామానికి చెందిన అల్లు రామారావు ఆదివారం రాత్రి పరవాడ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి నాలుగు ఫుల్ మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో ఏఎస్ఐ నాయుడు తనిఖీలు చేసి, అతని వద్ద మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రామారావుపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

వరహాపురంలో విషాదం

» భవన నిర్మాణ పనులకు వెళ్లిన గ్రామ యువకుడు మృతి



తాటికొండ వెంకటరమణ (ఫైల్)

చీడికాడ, ఏప్రిల్ 21 : భవన నిర్మాణ పనులకు పట్టణానికి వెళ్లిన కార్మికుల్లో ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతిచెందడంతో మండలంలోని వరహాపురంలో విషాదం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలివి. వరహాపురం గ్రామానికి చెందిన తాటికొండ వెంకటరమణ (23), పోతు బంతి పైడిరాజు శనివారం పర వాడ మండలం లంకెలపాలెం గ్రామం వద్ద గృహ నిర్మాణ పనుల నిమిత్తం వెళ్లారు. అక్కడ నాలుగో అంతస్థు శ్లాబ్ కాంక్రీట్ వేసేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేస్తుండగా అది కూప్పకూలిపోవడంతో వెంకట రమణ, పైడిరాజు తీవ్ర గాయాలకు గురయ్యారు. తోటి కూలీలు స్థానికుల సాయంతో వీరిని తొలుత అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో కేజీహెచ్‌కు తీసుకెళుతుండగా వెంకటరమణ మార్గ మధ్యలో ప్రాణాలు విడిచాడు. పైడిరాజు ప్రస్తుతం కేజీహెచ్‌లో చావుబతుకుల మధ్య కొట్టిమిట్టాడుతున్నాడు. పోస్టుమార్టం అనం తరం వెంకటరమణ మృతదేహం ఆదివారం సాయంత్రం గ్రామానికి చేరడంతో విషాదం నెలకొంది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కంటతడిపెట్టారు. వెంకటరమణ తండ్రి నాయుడు పదేళ్ల క్రితం మృతిచెందారు. తాజా ఘటనతో తల్లి, సోదరి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇతడికి ఇంకా వివాహం కాలేదు. ఈ విషయం తెలుసుకున్న మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, వైసీపీ మండల నాయకులు గొల్లవిల్లి రాజుబాబు, ధర్మిశెట్టి కొండబాబులు ఆదివారం ఉదయం కేజీహెచ్‌కు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 21: వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

సంత్రాగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు-సంత్రాగచ్చి

08845 నంబరు గల రైలు ఈనెల 26 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 7.00 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.00 గంటలకు దువ్వాడ, ఆదివారం ఉదయం తెల్లవారుజాము 2.00 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరిగి ఈనెల 28 నుంచి జూన్ 30 వరకు ప్రతి ఆదివారం ఉదయం 3.15 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు రాత్రి 8.55 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 10.48 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది.

కోయంబత్తూరు-బరౌని-కోయంబత్తూరు

06059 నంబరు గల రైలు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.50 గంటలకు కోయంబత్తూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ, మూడో రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల 26 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరి మూడో రోజు ఉదయం 3.48 గంటలకు దువ్వాడ, నాల్గో రోజు ఉదయం 3.45 గంటలకు కోయంబత్తూరు చేరుతుంది.

పాటిపల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించిన స్టేట్ అబ్జర్వర్



మోడల్ స్కూల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 21: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఆదివారం అమరావతి నుంచి వచ్చిన స్టేట్ అబ్జర్వర్ ఎంఆర్‌ఏ శామ్యూల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షా కేంద్రంగా ఏపీ మోడల్ స్కూల్ ఎంపికైనట్టు ఆయన చెప్పారు. పాఠశాలలో వసతులు, మౌలిక సదుపాయాలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

'ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలి'

అచ్యుతాపురం, ఏప్రిల్ 21: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన వర్కింగ్ కమిటీ మండల అధ్యక్షుడు మేరుగు ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం పూడిమడక 16వ వార్డులో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి జనసేన గుర్తు గాజుగ్లాసు, బీజేపీ గుర్తు కమలంలపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చోడిపల్లి గంగరాజు, ఎరిపల్లి దేముడు, ఎం. కాశీరమణ, జి.అప్పలరాజు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	411
విజయనగరం	415
శ్రీకాకుళం	415

అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు....

	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
చోడవరం	1,04,450	1,10,561	6	2,15,017
మాడుగుల	91,291	95,921	11	1,87,223
అనకాపల్లి	1,01,744	1,09,148	5	2,10,897
పెందుర్తి	1,48,555	1,50,502	5	2,99,062
ఎలమంచిలి	99,340	1,04,724	9	2,04,073
పాయకరావుపేట	1,21,911	1,25,595	2	2,47,508
నర్సీపట్నం	1,01,312	1,07,556	5	2,08,873
మొత్తం	7,68,603	8,04,007	43	15,72,653

కాంగ్రెస్ కంచుకోటలో ప్రాంతీయ పార్టీల హవా

ఆ దర్శనీయులు ఇద్దరు...

- విలువలతో కూడిన రాజకీయాలు నెరపిన మాజీ ఎమ్మెల్యేలు రమణ, గోవిందరావు
- ప్రజా సేవ కోసం సొంత ఆస్తులు అమ్మకం


పీవీ రమణ, మాజీ ఎమ్మెల్యే


కోడుగంటి గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే

చిన్నపాటి పదవులు వస్తేనే ప్రస్తుత నాయకులు ఖరీదైన కారుల్లో తిరుగుతుండడం చూస్తుంటాం. కానీ, నాటి తరం నాయకులు అలా ఉండేవారు కాదు. ప్రజాసేవే పరమావధిగా భావించేవారు. ఏ పనిలోనూ రూపాయి ఆశించేవారు కాదు. అంతేకాదు, తమకున్న ఆస్తులను సైతం ప్రజాసేవకు ఉపయోగించేవారు. అటువంటి కోవకు చెందినవారే అనకాపల్లి ప్రాంతానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు పీవీ రమణ, కోడుగంటి గోవిందరావు.

పీవీ రమణ...

పీవీ రమణ 1919 అక్టోబరులో మునగపాకలో జన్మించారు. ప్రాథమిక విద్య అంతా అనకాపల్లిలో సాగింది. అనంతరం విశాఖ ఏవీఎన్ కళాశాలలో డిగ్రీ చేశారు. జమీందారీ కుటుంబానికి చెందిన పీవీ రమణ 1943లో గ్రామ మునసబుగా వ్యవహరించారు. 1945లో రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా వ్యవహరించి రైతాంగ సమస్యలపై పోరాడేవారు. 1958లో ఎమ్మెల్సీగా, 1962లో కొండకర్ల నియోజకవర్గం నుంచి సీపీఐ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1972లో అనకాపల్లి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. పీవీ నరసింహరావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పీవీ రమణ విప్‌గా వ్యవహరించారు. వారి మధ్య ఉన్న సాన్నిహిత్యం వల్ల ప్రధానమంత్రి హోదాలో పీవీ ఒకసారి విశాఖకు వచ్చినప్పుడు పీవీ రమణను పిలిపించుకుని మాట్లాడారు. గ్రామ సర్పంచ్‌గా, ఎంపీపీగా, పీఏసీఎస్ అధ్యక్షునిగా, డీసీఎంఎస్ అధ్యక్షునిగా, సూపర్‌బజార్ ఛైర్మన్‌గా సుమారు 60 పదవులు వరకు చేపట్టారు. 1993లో సారా వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఆర్ఈసీఎస్ వ్యవస్థాపకులుగా, ఛైర్మన్‌గా కూడా వ్యవహరించారు. తుది శ్వాస విడిచేంత వరకు ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షునిగా పనిచేశారు. ఒకసారి ఎమ్మెల్సీగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన పీవీ రమణ ప్రజల కోసం ఉన్న ఆస్తులను కూడా అమ్మేశారు. అనకాపల్లి నుంచి పూడిమడక మధ్య ఉన్నత పాఠశాల లేకపోవడంతో 1951-52 మధ్యకాలంలో మునగపాకలో హైస్కూల్‌ను ఏర్పాటుచేసేందుకు అప్పట్లో ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చారు. బంధువులు స్థలం ఇవ్వడంతో నిర్మాణానికి రూ.40 వేలు ఖర్చు అవుతుందని నిర్ణయించి 50 శాతం నిధులు ప్రభుత్వం నుంచి, 50 శాతం ప్రజల నుంచి సేకరించి నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. అయితే అప్పట్లో ప్రజల నుంచి కేవలం రూ.10 వేలు మాత్రమే విరాళాలు అందడంతో మిగిలిన పది వేల రూపాయలను రమణ అప్పు చేసి పాఠశాల నిర్మాణం చేపట్టారు. ఈ అప్పులు తీర్చడానికి తన నాలుగు ఎకరాల సొంత ఆస్తిని అమ్మినట్టు పలువురు చెబుతున్నారు. 2009 జనవరి 14న ఆయన తుదిశ్వాస విడిచారు. నిజాయితీకి నిలువుటద్దం పీవీ రమణ అని ఇప్పటికీ ప్రజలు చెబుతుంటారు.

కోడుగంటి గోవిందరావు...

కోడుగంటి గోవిందరావు స్వాతంత్ర్య సమరయోధుడు. డిగ్రీ చదివిన ఆయన 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని బళ్లారిలో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించారు. 1943లో కమ్యూనిస్టు పార్టీలో రైతు ఉద్యమాలకు తెర లేపారు. అదే ఏడాది నాగులాపల్లిలో జిల్లా రైతు మహాసభను ఏర్పాటుచేయగా పోలీసులు అడ్డుకుని జైలుకు పంపారు. 1945లో కశింకోటలో జిల్లా రైతు మహాసభను నిర్వహించారు. 1948లో కమ్యూనిస్టు పార్టీని నిషేధించారు. 1951లో నిషేధం ఎత్తివేసిన తరువాత ఎన్నికల బరిలో దిగారు. 1952, 1962, 1967, 1978లో కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవలో అంకితమయ్యారు. అనకాపల్లి నుంచి నాలుగు దఫాలు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. ఎమ్మెల్యేగా పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వ్యవహరించేవారు. ఏనాడు కూడా రూపాయి ఆశించకుండా నిజాయితీగా వ్యవహరించారు. స్వగ్రామం విజయనగరం అయినప్పటికీ పార్టీ ఆదేశాల మేరకు అనకాపల్లికి వచ్చి కమ్యూనిస్టు పార్టీ వ్యవహారాలను చూసేవారు. సొంతిల్లు లేకపోవడంతో గాంధీనగరంలో పార్టీ కార్యకర్తలు ఇల్లు కట్టించి ఇచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుడు కోటాలో విశాఖపట్నంలో ప్రభుత్వం ఐదెకరాల భూమి ఇచ్చింది. ఆ స్థలాన్ని విక్రయించి అనకాపల్లిలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి చొరవ చూపడంతో పాటు హైదరాబాద్‌లో పార్టీ తరఫున నిర్మించిన వృద్ధాశ్రమానికి కూడా డబ్బు ఇచ్చారు. ఆయనకు సొంత వాహనం కూడా లేదు. పోలవరంపై నిరంతరం పోరాటం సాగించేవారు. పీవీ రమణ, కోడుగంటి గోవిందరావులు ఇప్పటికీ అనకాపల్లి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారు. ● అనకాపల్లి టౌన్

ఇదీ అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం ముఖచిత్రం

- 1962లో ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు
- ఇప్పటికి 15సార్లు ఎన్నికలు
- తొమ్మిదిసార్లు కాంగ్రెస్ విజయం
- ఐదుసార్లు టీడీపీ, ఒకసారి వైసీపీ...


ఎస్ఆర్ఏఎస్ అప్పలనాయుడు


పెతకంశెట్టి అప్పలనరసింహం


గుడివాడ గురునాథరావు


అయ్యన్నపాత్రుడు



పప్పల చలపతిరావు

'అనకాపల్లి' లోక్‌సభ నియోజకవర్గానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఒకప్పుడు పక్క జిల్లా నియోజకవర్గం పరిధిలో, ఆ తర్వాత జిల్లాలోని మరో నియోజకవర్గం పరిధిలో ఉండి 1962లో స్వతంత్ర నియోజకవర్గంగా ఏర్పాటైంది. స్వాతంత్ర్యం వచ్చాక 1952లో తొలిసారి ఇక్కడి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. విజయనగరం పరిధిలో ఉండగా జరిగిన ఈ ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ అభ్యర్థి కె.సుబ్రహ్మణ్యం సమీప ప్రత్యర్థి వీరభద్రస్వామిపై భారీ మెజారిటీతో గెలుపొందారు. సుబ్రహ్మణ్యంకు 1,12,096 ఓట్లు రాగా, వీరభద్రస్వామికి కేవలం 27,541 ఓట్లు లభించాయి. 1957లో నియోజకవర్గాల పునర్విభజనలో అనకాపల్లి గొలుగొండ పార్లమెంటరీ నియోజకవర్గంలో చేరింది. ఈ ఎన్నికల్లో ద్విసభ్యత్వ విధానాన్ని అమలు చేయడంతో ఒకరు జనరల్ అభ్యర్థి, మరొకరు రిజర్వ్ అభ్యర్థిని ఇక్కడి ప్రజలు ఎన్నుకోవాల్సి వచ్చింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన మిస్సుల సూర్యనారాయణమూర్తి గెలుపొందగా, ఎస్టీ రిజర్వేషన్‌పై అల్లూరి సీతారామరాజు అనుచరుడు కె.వి.పడాల్ (మల్లుదొర) గెలుపొందారు.

ఇప్పటివరకు 15సార్లు ఎన్నికలు


కొణతాల రామకృష్ణ


సబ్బం హరి


గంటా శ్రీనివాసరావు

అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం 1962లో ఏర్పాటైంది. ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. తొమ్మిదిసార్లు కాంగ్రెస్ జెండా రెపరెపలాడగా, ఐదుసార్లు తెలుగుదేశం పార్టీ, ఒకసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున కొణతాల రామకృష్ణ రెండుసార్లు గెలుపొందారు. గుడివాడ గురునాథరావు, సబ్బం హరి ఒక్కొక్కసారి విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీ తరఫున పెతకంశెట్టి అప్పలనరసింహం, చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, పప్పల చలపతిరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ పార్టీ తరఫున బి.సత్యవతి ఒక్కొక్కసారి గెలుపొందారు. ఈసారి కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ), వైసీపీ మధ్య ప్రధాన పోటీ జరగనున్నది. కూటమి అభ్యర్థిగా సీఎం రమేశ్, వైసీపీ నుంచి బూడి ముత్యాలనాయుడు పోటీ పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలో అనకాపల్లి, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.

ఇదీ నియోజకవర్గం చరిత్ర

ఒకప్పుడు అనకాపల్లి ప్రాంతం గొలుగొండ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఉండేది. 1962లో అనకాపల్లి ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటైంది. నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో 1984లో 1,74,816 ఓట్ల అత్యధిక మెజారిటీతో టీడీపీ అభ్యర్థి పెతకంశెట్టి అప్పలనరసింహం గెలుపొందగా, 1989లో జరిగిన ఎన్నికల్లో అదే పెతకంశెట్టిపై కేవలం 9 ఓట్లతో గెలిచి కొణతాల రామకృష్ణ చరిత్ర సృష్టించారు. ఈ ఎన్నికల్లో రామకృష్ణకు 2,99,109 ఓట్లు, అప్పలనరసింహానికి 2,99,100 ఓట్లు వచ్చాయి.

కాంగ్రెస్ తరఫున మిస్సుల సూర్యనారాయణమూర్తి 1962, 1967, 1971లో హ్యాట్రిక్ విజయం సాధించారు. ఆయన కొండకర్ల గ్రామానికి చెందినవారు కాగా ఇప్పుడు ఆయన కుటుంబ సభ్యులెవరూ గ్రామంలో లేరు. ఆ తరువాత ఎస్.ఆర్.ఎ.ఎస్.అప్పలనాయుడు కూడా హ్యాట్రిక్ (1977, 1980, 1984) మూడుసార్లు విజేతగా నిలిచారు. ఎస్‌డబ్ల్యూఏ పార్టీ తరఫున మూడుసార్లు పోటీ చేసిన వి.వి.రమణ ఒక్క పర్యాయం గెలవలేకపోయారు. అలాగే సీపీఐ తరఫున పోటీ చేసిన కె.గోవిందరావుకు లోక్‌సభలో ప్రవేశించే అవకాశం దక్కలేదు. గోవిందరావు నాలుగుసార్లు అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందడం విశేషం. 1984లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన పెతకంశెట్టి అప్పలనరసింహం 3,22,347 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థి అప్పలనాయుడు 1,47,531 ఓట్లు సాధించారు. అప్పలనరసింహానికి 1,74,816 ఓట్లు మెజారిటీ వచ్చింది. ఇదే ఇప్పటివరకు నియోజకవర్గం రికార్డు. మింది గ్రామానికి చెందిన గుడివాడ గురునాథరావు 1998లో జరిగిన ఎన్నికల్లో అనకాపల్లి నుంచి పోటీ చేసి గెలుపొందగా, ఆయన తనయుడు అమర్‌నాథ్ 2014లో జరిగిన ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అలాగే నర్సీపట్నానికి చెందిన చింతకాయల అయ్యన్నపాత్రుడు 1996లో అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కొణతాల రామకృష్ణపై 50,172 ఓట్ల మెజారిటీ సాధించగా, 1998లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు 25,925 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి గుడివాడ గురునాథరావు చేతిలో ఓటమి పాలయ్యారు.
● అనకాపల్లి


అనకాపల్లి నెహ్రూ చౌక్

విజేతలు వీరే

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	మెజారిటీ
1952-57	కె.సుబ్రహ్మణ్యం	సోషలిస్టు	వీరభద్రస్వామి	84,555
(విజయనగరంలో అనకాపల్లి కలిసి ఉన్నప్పుడు జరిగిన ఎన్నిక)				
1957-62	ఎం.ఎస్.మూర్తి	కాంగ్రెస్	కె.గోవిందరావు	---
1957-62	కె.వి.పడాల్	సీపీఐ	ఎస్.సీతారామయ్య	---
(గొలుగొండ పార్లమెంటరీ నియోజకవర్గంలో ద్విసభ్యత్వ నియోజకవర్గం)				
అనకాపల్లి నియోజకవర్గం ఏర్పాటైన తర్వాత				
1962-67	ఎం.ఎస్.మూర్తి	కాంగ్రెస్	వి.వి.రమణ (ఎస్‌డబ్ల్యూఏ)	16,010
1967-71	ఎం.ఎస్.మూర్తి	కాంగ్రెస్	వి.వి.రమణ (ఎస్‌డబ్ల్యూఏ)	3,024
1971-77	ఎస్.ఆర్.ఎ.ఎస్.అప్పలనాయుడు	కాంగ్రెస్	వి.వి.రమణ (ఎస్‌డబ్ల్యూఏ)	1,46,094
1977-80	ఎస్.ఆర్.ఎ.ఎస్.అప్పలనాయుడు	కాంగ్రెస్	పి.వి.చలపతిరావు (బీఎల్‌డీ)	26,936
1980-84	ఎస్.ఆర్.ఎ.ఎస్.అప్పలనాయుడు	కాంగ్రెస్	ఆనందగజపతిరాజు జెఎన్‌పీ(ఎస్)	29,123
1984-89	పెతకంశెట్టి అప్పలనరసింహం	టీడీపీ	ఎస్.ఆర్.ఎ.ఎస్.అప్పలనాయుడు	1,74,816
1989-91	కొణతాల రామకృష్ణ	కాంగ్రెస్	పి.అప్పలనర్సింహం (టీడీపీ)	9
1991-96	కొణతాల రామకృష్ణ	కాంగ్రెస్	పి.అప్పలనర్సింహం (టీడీపీ)	11158
1996-98	చింతకాయల అయ్యన్నపాత్రుడు	టీడీపీ	కొణతాల రామకృష్ణ (కాంగ్రెస్)	50172
1998-99	గుడివాడ గురునాథరావు	కాంగ్రెస్	సీహెచ్ అయ్యన్నపాత్రుడు (టీడీపీ)	25925
1999-2004	గంటా శ్రీనివాసరావు	టీడీపీ	గుడివాడ గురునాథరావు (కాంగ్రెస్)	47464
2004-09	పప్పల చలపతిరావు	టీడీపీ	నందగోపాల్ (కాంగ్రెస్)	15,414
2009-14	సబ్బం హరి	కాంగ్రెస్	నూకారపు సూర్యప్రకాశరావు (టీడీపీ)	52,912
2014-19	ముత్తంశెట్టి శ్రీనివాసరావు	టీడీపీ	గుడివాడ అమర్ (వైసీపీ)	47,932
2019-24	భీశెట్టి సత్యవతి	వైసీపీ	ఆడారి ఆనందకుమార్ (టీడీపీ)	89,192


ముత్తంశెట్టి శ్రీనివాసరావు


భీశెట్టి సత్యవతి

ఓటరు మాట

పారిశ్రామిక రంగంపై అవగాహన అవసరం



పారిశ్రామిక రంగంపై అవగాహన ఉన్న నాయకులను ఎన్నుకోవాలి. పరిశ్రమలు అభివృద్ధి చెందితే నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుంది. పరిశ్రమలకు మౌలిక వసతులు కల్పన, కార్మికుల హక్కుల పరిరక్షణ పట్ల చిత్తశుద్ధి, అనుభవం ఉన్నవారిని ఆదరించాలి. సొంతపనులు, సంపాదన, అధికారం కోసం రాజకీయాల్లోకి వచ్చే వారిని గెలిపిస్తే సమాజానికి ఎటువంటి ఉపయోగం ఉండదు. ఓటర్లు విజ్ఞతను ప్రదర్శించాలి. - మొల్లి అప్పారావు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి, గాజువాక

జాతీయభావం అవసరం



జాతీయ భావం ఉన్న వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలి. కుల,మత, వర్గ విభేదాలను రూపుమాపే నేతలే అవసరం. సంకుచిత భావాలున్న వారిని తిరస్కరించాలి. మంచివారు సభ్యులుగా ఎన్నికైతే మంచి ప్రభుత్వం ఏర్పడుతుంది. సమాజం అభివృద్ధి చెందుతుంది.

- కొవిరి దేముడు, ప్రైవేటు ఉద్యోగి, గంగవరం

గుణగణాలు గుర్తించాలి



చట్టసభలకు పోటీ చేసే అభ్యర్థుల గుణగణాలను, నేరచరిత్రను పరిశీలించి ఓటువేయాలి. కులమతాలకు, ప్రలోభాలకు గురికాకుండా అభివృద్ధి పరుగులు పెట్టించే సామర్థ్యం ఉందా లేదా చూడాలి. అధికారాన్ని నిర్ణయించేది ప్రజలే. ప్రలోభాలు, ఉచితాలకు ప్రభావితం కాకుండా విజ్ఞతతో ఓటువేయాలి. మంచి ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలి.

- వెదుల్లపల్లి బాబూరావు, విశ్రాంత ఉద్యోగి, మధురానగర్

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుంటున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీమనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

ప్రచారంలో అద్దె జనం

- రోజుకు రూ.300 నుంచి రూ.400
- ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం
- ఉపాధి మార్గంగా మార్చుకుంటున్న కూలీలు

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైపోయింది. షెడ్యూల్ వచ్చినప్పటి నుంచే ప్రచారాలు జోరుగా సాగుతున్నప్పటికీ... ఇప్పుడు మరింత ఊపందుకున్నాయి. రంగంలోని అభ్యర్థులందరి వెంటా జనం అవసరం. ఇందుకోసం వారిని సమీకరించాల్సి ఉంటుంది. అయితే తాజాగా ప్రచారం కోసం అభ్యర్థి వెంట తిరిగేందుకు అద్దెకు జనం లభిస్తున్నారు. ఇలాంటి వారి కోసం శివారు ప్రాంతాలు, మురికివాడల్లోని కూలీలను అన్వేషిస్తున్నారు. పార్టీల అభిమానులు, నాయకులే కాకుండా ఇలా రోజువారి అద్దెకు తీసుకువచ్చిన జనంతో నేతలు ఎన్నికల ప్రచారం చేయిస్తున్నారు.



పార్టీ జెండాలు పట్టుకోవడం, బ్యానర్లు మోయడం, జిందాబాద్‌లు కొట్టడం, ప్రసంగాలకు విజిల్స్ వేయటం, అవసరమైన సందర్భంలో డాన్సులు చేయడం, చప్పట్లు కొట్టండి అనగానే మోత మోగించడం వారి పని.. ఇందుకోసం చేసే పనిని బట్టి ఇంత అని అద్దె చెల్లిస్తున్నారు. రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు ఇస్తున్నారు. దీంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం (చికెన్ బిర్యానీ, వాటర్ బాటిల్), మద్యం ప్రియులకు క్వార్టరు బాటిల్) అందిస్తున్నారు. అద్దెకు తెచ్చే జనంతో రోజంతా ప్రచారం చేయించడం లేదు. ఎండల కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకూ ప్రచారంలో ఉంచుతున్నారు. ఎన్నికల సమయంలో ఇదొక ఆదాయ మార్గంగా మారడంతో ఎవరు ముందుగా వచ్చి పిలిస్తే వారి పార్టీకి అనుకూలంగా ప్రచారం చేసేందుకు కొంతమంది జట్లుగా సిద్ధమవుతున్నారు. ప్రచారం మరింత ఊపందుకుంటే తమకు వచ్చే మొత్తం కూడా పెరుగుతుందని వీరంతా భావిస్తున్నారు.


● కూర్మన్నపాలెం

గేలి చేసినా... గెలిచారు

కొత్త ముఖాలు వీరేం గెలుస్తారు...నియోజవర్గ మూలాలే తెలియవు. అసలు రాజకీయ అనుభవమే లేదు... ఉద్దండులతో పోటీ పడే స్థాయి లేదు... అని గేలిచేసిన నేతలే విజయబావుటా ఎగురవేశారు. రాజకీయ ఉద్దండుల పురిటిగడ్డగా పేర్గాగాంచిన పెందుర్తి నియోజవర్గం చాలామంది కొత్తవారికి రాజకీయ భవిష్యత్తును కల్పించింది. ముఖ్యంగా 1994, 2009, 2019లో జరిగిన ఎన్నికల్లో ముగ్గురు కొత్తవారు ఎన్నికయ్యారు. నాలుగు దశాబ్దాలుగా జరిగిన ఎన్నికల్లో పెందుర్తి నుంచి టీడీపీ, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వారే ఎమ్మెల్యేగా ఎన్నికవుతున్న విధానాన్ని బ్రేక్ చేస్తూ ఇతర పార్టీల నుంచి పోటీచేసి రాజకీయ దిగ్గజాలను మట్టికరిపించిన వారూ ఉన్నారు. వీరిలో 1994లో సీపీఐ నుంచి మానం ఆంజనేయులు, 2009లో ప్రజారాజ్యం నుంచి పంచకర్ల రమేశ్‌బాబు 2019లో అన్నంరెడ్డి అదీప్‌రాజ్ (వైసీపీ) ఎమ్మెల్యేలుగా గెలిచి చరిత్ర సృష్టించారు.

నియోజవర్గ పునర్విభజన తరువాత 2009లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పీఆర్పీ నుంచి పోటీచేసిన పంచకర్ల రమేశ్‌బాబు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పెందుర్తి, పరవాడ, సబ్బవరం నుంచి పలువురు నేతలు, ఆశావాహులు పెందుర్తి నుంచి పోటీచేసేందుకు ఉత్సాహం చూపించారు. ఈ దశలో తీవ్ర ఉత్కంఠకు తెరదించుతూ చివరి నిమిషంలో విశాఖకు ,చెందిన పంచకర్ల రమేశ్‌బాబుకు పెందుర్తి నుంచి పోటీచేసేందుకు పీఆర్పీ టికెట్ లభించింది. ఉత్తరం నియోజకవర్గం నుంచి పోటీచేసేందుకు రంగం సిద్ధం చేసుకున్న పంచకర్ల ఇక్కడి నుంచి పోటీ చేయాల్సి రావడం, నామినేషన్ గడువు ముగియడానికి ముందు రోజు టికెట్ లభించడంతో అతని విజయంపై ఎవరికీ నమ్మకం కలగలేదు. బీఫారం తీసుకుని పీఆర్పీ అభ్యర్థిగా నలుగురు మిత్రులతో కలసి చివరిక్షణంతో పంచకర్ల నామినేషన్ దాఖలు చేశారు.

అప్పటికే కాంగ్రెస్ నుంచి గండి బాబ్జీ, టీడీపీ నుంచి బండారు సత్యనారాయణమూర్తి లాంటి ఉద్దండ నేతలు బరిలో ఉన్నారు. నియోజకవర్గానికి పూర్తిగా కొత్తముఖం అయిన పంచకర్లకు ఈ ఎన్నిక విషమపరీక్షగా నిలిచింది.దీంతో పాటు పీఆర్పీ టికెట్ ఆశించిన ఆశావాహులు నేతల ఇబ్బందులు. తొలిప్రయత్నంలోనే రాజకీయంగా పెనుసవాళ్లు ఎదుర్కొన్న పంచకర్ల వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఆశావాహులను బుజ్జగించారు. తన సామాజికవర్గం ఓట్లను ఆకర్షించారు. సుడిగాలిలా పర్యటించి, ప్రచారం చేశారు. సుమారు మూడు వేలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. దీంతో 16 రోజుల వ్యవధిలోనే పంచకర్ల పెందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికై చరిత్ర సృష్టించారు.


మానం ఆంజనేయులు


పంచకర్ల రమేష్‌బాబు


అన్నంరెడ్డి అదీప్‌రాజ్

ద్రోణంపై మానం గెలుపు..

పెందుర్తి నుంచి 1994లో సీపీఐ అభ్యర్థిగా పోటీచేసిన మానం ఆంజనేయులు ద్రోణంరాజు సత్యనారాయణ కుమారుడు ద్రోణంరాజు శ్రీనివాస్‌పై విజయం సాధించారు. కాంగ్రెస్ రాజకీయాలను శాసిస్తున్న ద్రోణంరాజు తన కుమారుడు విజయం కోసం అన్ని శక్తులను ఒడ్డారు. టీడీపీ మద్దతుతో సీపీఐ అభ్యర్థిగా పోటీచేసిన మానం ఆంజనేయులుకు మద్దతుగా చంద్రబాబు సైతం ప్రచారం చేశారు. అయితే ద్రోణంరాజు తన కుమారుడిని ఎలాగైనా శాసనసభకు పంపాలన్న కృతనిశ్చయంతో ప్రచారం చేశారు. అయితే ఆంజనేయలు వ్యూహాత్మకంగా వ్యవహరించి ద్రోణం వ్యతిరేక వర్గాన్ని కలుపుకుని అడుగులు వేశారు. దీంతో సుమారు 30 వేల మెజారిటీతో రాజగురువు ద్రోణం దిమ్మ తిరిగేలా విజయం సాధించారు.

బండారుకు అదీప్‌రాజ్ ఝులక్

ఇదిలా ఉండగా 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన రాంపురానికి చెందిన అన్నంరెడ్డి అదీప్ రాజ్ బండారు సత్యనారాయణ మూర్తిపై విజయం సాధించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి మంత్రిగా పనిచేసిన బండారుపై అన్నంరెడ్డి పోటీకి దిగడంతో ఎంతో మంది గేలి చేశారు. అంతేకాకుండా మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ టీడీపీలో చేరడంతో పార్టీ బలం పెరిగింది. బండారు ఎన్నికల లాంఛనమే అనుకున్న దశలో జగన్ హవాతో అదీప్‌రాజ్ గట్టెక్కారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ గాలి వీయడంతో ఏకంగా 30 వేల మెజారిటీ కూడా దక్కింది. ● పెందుర్తి

నూకాంబికను దర్శించుకున్న సీఎం రమేశ్



తాకాశివీధి నూకాంబికను దర్శించుకుంటున్న సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 21 : స్థానిక తాకాశివీధిలోని నూకాంబిక అమ్మవారిని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, ఆయన సోదరులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తాకాశి రాజేష్ ఆధ్వర్యంలో సీఎం రమేశ్, ఆయన సోదరులకు స్వాగతం పలికి దగ్గరుండి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సీఎం రమేశ్‌ను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో సీఎం రిత్విక్, బీజేపీ నాయకుడు పరుచూరి భాస్కరరావు ఉన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

- పగలంతా కరెంట్ ఉండదు..
- అర్ధరాత్రి దాటుతున్నా అదే పరిస్థితి
- దోమలు, ఉక్కపోతతో ప్రజల తిప్పలు



పాయకరావుపేట మెయిన్‌రోడ్డులో వెలగని వీధిలైట్లు

పాయకరావుపేట, ఏప్రిల్ 21 : పాయకరావుపేటలో కొద్ది రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎప్పుడు విద్యుత్ ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారు. ప్రస్తుతం పగలు 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అటువంటి సమయంలో అప్రకటిత విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఇది చాలదన్నట్టు రాత్రి పూట గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ఉక్కపోత, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేసిన విద్యుత్ శాఖ అధికారులు మరలా రాత్రి 7 గంటలకు నిలిపివేసి అర్ధరాత్రి దాటినా విద్యుత్ రాలేదు. దీంతో పట్టణంలో అంధకారం నెలకొనగా ప్రజలు ఉక్కపోత, దోమలతో అవస్థలు పడ్డారు. మెయిన్‌రోడ్డుతోపాటు అన్ని వీధుల్లో అంధకారం నెలకొంది. పట్టణంలో కుక్కలు పెరిగిపోవడంతో ఇళ్లకు చేరుకునేందుకు రాత్రి ప్రయాణికులు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికితోడు ఎన్నికల సమయం కావడంతో చీకట్లో గొడవల జరిగితే పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం వైపే ప్రజల మొగ్గు

జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్



ధర్మవరంలో నగిరెడ్డి కుటుంబీకులను జనసేన పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న సుందరపు విజయ్ కుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 21: కూటమి ప్రభుత్వాన్ని ఎంత తొందరగా అధికారంలోకి తీసుకువద్దామా అని ప్రజలంతా ఉవ్విళ్లూరుతున్నారని జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆదిల సమక్షంలో పెద్ద ఎత్తున మహిళలు, యువకులు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుందరపు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో పాలకుల పనితీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు రాజు దారుణాలు చూసి ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. అనంతరం జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గంలో సుందరపు విజయ్‌కుమార్‌కు విజయం అందించేందుకు ప్రజలు చూస్తున్నారన్నారు. అనకాపల్లి బీజేపీ అభ్యర్థి సీఎం.రమేశ్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ధర్మవరంలో పెద్ద ఎత్తున జనసేనలో చేరిక

ఎలమంచిలి ధర్మవరం ప్రాంతంలో సుందరపు విజయ్‌కుమార్ సమక్షంలో నగిరెడ్డి కుటుంబీకులు పెద్ద సంఖ్యలో జనసేన పార్టీలో చేరారు. ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సుందరపు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, కూటమి పార్టీల నేతలు కొఠారు సాంబ, కొఠారు నరేష్, గుర్రాల శేఖర్, నక్కా శివశంకర్, లాలం సోమునాయుడు, పల్లా సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాల్తేరులో కూటమి పార్టీల ప్రచారం



పాల్తేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అనిత తనయుడు నిఖిల్

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 21 : మండలంలోని పాల్తేరులో ఆదివారం మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత తనయుడు నిఖిల్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భవిషత్తు, అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు కోసం రానున్న ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనితకు ఓట్లువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు దేవవరపు రాజబాబు, దేవవరపు వెంకట్రావు, బుద్దాల శ్రీనివాసరావు, జనసేన నాయకులు దేవవరపు రఘు, నారపురెడ్డి పద్మ, బీజేపీ నాయకులు పి.రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులదే విజయం : గెడ్డం బుజ్జి

కోటవురట్ల: పాయకరావుపేట నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని జనసేన పార్టీ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి జోస్యం చెప్పారు. ఆదివారం మండలంలోని సుంకపూర్ గ్రామంలో వైసీపీ సీనియర్ నాయకులు బత్తిన అప్పారావు, అచంట ఉదయ్‌కుమార్ జనసేన పార్టీలో చేరారు. వారికి బుజ్జి కండువాలు వేసి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలిసెట్ మోడల్ పరీక్షకు 117 మంది హాజరు



పెదగుమ్ములూరులో పాలిసెట్ మోడల్ టెస్టను నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 21: మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం మండల పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పాలిసెట్ మోడల్ టెస్టును నిర్వహించారు. పీఆర్‌టీయూ నాయకులు భద్రరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ సమక్షంలో జరిగిన ఈ మోడల్ టెస్ట్‌లో ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, ఎలమంచిలి మండలాలకు చెందిన 117మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలనే ఉద్దేశంతో పాలిటెక్నిక్ కోచింగ్‌నుఏర్పాటుచేసినట్టు చెప్పారు.

జీవీఎంసీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ



స్కూల్‌కు ఇచ్చిన బెంచీలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 21: స్థానిక వెంయిన్ రోడ్డు లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు బెంచీలు, టేబుళ్లు ఆదివారం వితరణగా ఇచ్చారు. పాఠశాలలో 1981-82 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఓరే మిత్రమా సంస్థ ఆధ్వర్యంలో రెండు టేబుళ్లు, ఐదు బెంచీలను పాఠశాల హెచ్ఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడే ఆళ్ల రామకృష్ణ, కార్యదర్శి ఎ.రవీంద్రనాథ్, కోశాధికారి లలితాశంకర్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 21 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగరం, ఆర్‌అండ్‌బీ బంగ్లా రోడ్డు, లక్ష్మీదేవిపేట, విజయరామరాజుపేట, ఏఎంసీ కాలనీ, మిరియాలకాలనీ, శ్రీరామనగర్ కాలనీ, ఉమ్మలాడ జంక్షన్, పూడిమడకరోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, శారదాకాలనీ, న్యూకాలనీ, నెహ్రూచౌక్ ప్రాంతాల్లో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా: సుందరపు

అచ్యుతాపురం, ఏప్రిల్ 21: ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తానని ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం రాత్రి అచ్యుతాపురం జంక్షన్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. హైపర్ ఆది మాట్లాడుతూ ఇద్దరు చెల్లెళ్లకు న్యాయం చేయని సీఎం జగన్ మనకేం మంచి చేస్తాడన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాస్‌పైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నాయి.

జనసేన పార్టీలో చేరిక



గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో జనసేనలో చేరిన కార్యకర్తలు

నక్కపల్లి, ఏప్రిల్ 21 : మండలంలోని చిన్నదొడ్డిగల్లులో ఆదివారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి సమక్షంలో జనసేన పార్టీలో 30 కుటుంబాలు చేరాయి. వీరిందరికీ గెడ్డం బుజ్జి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వెలగా సుధాకరరావు, నాయకులు తూము రాజబాబు, అమకంటి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయానికి వైసీపీ ఖాళీ : ప్రగడ

- టీడీపీలో పలువురి చేరిక

అచ్యుతాపురం, ఏప్రిల్ 21: ఎన్నికల సమయానికి వైసీపీ ఖాళీ అవడం ఖాయమని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆర్.సర్పాపురం నుంచి లాలం వేంకటరమణ, కసిరెడ్డి రవికుమార్, లాలం కృష్ణ, దిబ్బపాలెం పంచాయతీ గురజాపాలెం నుంచి బత్తిన గంటాలు, కోరంగి అప్పలరాజు, శ్రీను ఆధ్వర్యంలో భారీగా టీడీపీలో చేరారు. వారందరికీ నాగేశ్వరరావు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో జగన్ రెడ్డితోపాటు స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజుపై కూడా వ్యతిరేకత ఉండడంవల్లే టీడీపీ, జనసేన, బీజేపీల్లో వైసీపీ శ్రేణులు భారీగా చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నీరుకొండ నరసింగరావు, రాజాన విజయ్, లాలం రాజు, కాళ్ల రాజుబాబు, లాలం రమణ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 21 : రానున్న ఎన్నికల్లో అవినీతి వైసీపీని సాగనంపి కూటమి విజయమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పనిచేయాలని పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. అమృతపురం సమీపంలో ఆదివారం బూతు కన్వీనర్లు, వార్డు కన్వీనర్లు, ముఖ్యకార్యకర్తలకు పోల్ మేనేజ్‌మెంట్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆలీబాబా నలభై దొంగల్లా వైసీపీ రాష్ట్రాన్ని దోచుకుందని, అటువంటి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే సత్తా చంద్రబాబు వలనే సాధ్యమన్నారు. తన గుర్తు గాజు గ్లాసు, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా పెదయాతపాలెంకు చెందిన శరగడం రాము ఆధ్వర్యంలో 60 మంది, వంగలి,వెదుళ్లనవరకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరారు. వారందరికీ పంచకర్ల రమేశ్‌బాబు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పంచకర్ల వెంకటేశ్వరరావు,ఇందలి రమణ, ఎం. మహలక్ష్మీనాయుడు, సాలాపు వెంకటేశ్వరరావు, గండి ముత్యాలనాయుడు, బీపీ రావు, గండి దుర్గాప్రసాద్, కర్రి కనకరాజు, బంతికోళ్ల పద్మ, బోకం స్వామినాయుడు, పల్ల తాతారావు పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి

పరవాడ: కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు అన్నారు. ఈ.బోనంగి, గొర్లివానిపాలెం, పి.బోనంగి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలు, గ్రామస్థులు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ బొద్దపు శ్రీనివాసకాసులు, మాజీ సర్పంచులు అట్టా సన్యాసిఅప్పారావు, గొర్లి కనకారావు, రాయవరపు దేముడు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సదస్యం

నక్కపల్లి, ఏప్రిల్ 21: మండలంలోని ఉపమాక శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సదస్యం (పండితసభ) ఘనంగా జరిగింది. తొలుత సప్పరం వాహనంపై అయ్యవారు,అమ్మవారిని అలంకరించి అర్చకులు వెలవలపల్లి మహేష్, సంతోష్, కృష్ణమాచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఉత్సవ నిర్వాహకులు శింగంశెట్టి బాపన్నశెట్టి కుటుంబీకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలువురు పండితులను సత్కరించారు. కార్యక్రమంలో యువీఎస్ రావు, పచ్చిపులుసు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఉపమాక శివాలయంలో సదస్యం నిర్వహిస్తున్న దృశ్యం

చప్పగా జగన్ రోడ్‌షో

... 5వ పేజీ తరువాయి

రావడానికి గంట ముందు నుంచే వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

ప్రసంగం లేకుండా అభివాదాలతోనే ముగిసిన రోడ్‌షో

సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదివారం నగరంలో నిర్వహించిన రోడ్‌షోను ప్రసంగం లేకుండా కేవలం అభివాదాలతోనే ముగించేశారు. పెందుర్తి నియోజకవర్గంలో మొదలైన ఆయన బస్సు యాత్ర విశాఖ పశ్చిమ, ఉత్తరం, దక్షిణం, తూర్పు నియోజకవర్గాల మీదుగా భీమిలి నియోజకవర్గంలో ముగిసింది. అయితే సీఎం జగన్ కొన్నిచోట్ల బస్సుపై నిలబడి, మరికొన్నిచోట్ల లోపల కూర్చొని ప్రజలకు అభివాదం/నమస్కారం చేశారు తప్ప ఎక్కడ ఉపన్యసించలేదు. రెండు, మూడుచోట్ల బస్సు ఆపి వివిధ వర్గాలకు చెందినవారి నుంచి వినతి పత్రాలు అందుకున్నారు. కానీ ఎక్కడా ప్రజలను ఉద్దేశించి మాట్లాడకపోవడం, తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కనీసం కోరకపోవడం పార్టీ నేతలను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది.

సాగునీటి వనరులపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి



మట్టితో పూడుకుపోయిన సాగునీటి కాలువ

పట్టించుకోలేదు. దీంతో సాగునీరు అందక రైతులు అల్లాడిపోతున్నారు.

మాకవరపాలెం సర్పానదిలో (పిరుకుమదుం)కు ఉన్న ఏటి కాలువ గ్రోయిన్ గేట్లు ఐదేళ్ల క్రితం మరమ్మతులకు గురయ్యాయి. ఈ కాలువ గుండా పైడిపాల, మాకవరపాలెం, తామరం, నారాయణరాజుపేట, జి.కోడూరు గ్రామాల్లో ఉన్న సుమారు 800 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే ఈ కాలువకు ఉన్న గేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గేట్లు విరిగిపోయి కాలువలో కూరుకుపోవడంతో సాగునీరు రావడం లేదు. గత ఏడాది సర్పానదిలో నీరు ఉన్నా కాలువ గుండా పొలాలకు నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోయాయి. దీని వల్ల రైతులు నష్టపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రోయిన్ గేట్లు బాగు చేయించడంతో పాటు కాలువలో పూడికలు తీయాలని రైతులు కోరుతున్నారు.

ఐదేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం



ఏటికాలువ గ్రోయిన్ గేట్లు మరమ్మతులకు గురికావడంతో వరిసాగు చేసేందుకు ఐదేళ్లుగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. గేట్లు విరిగిపోయి కాలువలో కూరుకు పోవడంతో నీరు రావడం లేదు. దీని వల్ల చాలా నష్టపోతున్నాం.

- పంచదార్ల ఏసుబాబు, మాకవరపాలెం

లోకాయుక్త ఆదేశాలు బేఖాతరు

... 5వ పేజీ తరువాయి



నర్సీపట్నం ఇందిరా మార్కెట్

చేతులు దులుపుకున్నారు. షాపులు ఖాళీ చేయమన్నా చేయడం లేదని అధికారులు చేతులెత్తేశారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

బహిరంగ వేలం పాట నిర్వహించి దుకాణాలు కేటాయించి ఉంటే ప్రభుత్వానికి ఆదాయం వచ్చి ఉండేది. అయితే ఇష్టారాజ్యంగా పాలక వర్గం దుకాణాలను కేటాయించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. ఇందిరా మార్కెట్ లోపల, సాయిబాబా గుడి రోడ్డు, మెయిన్ రోడ్డును ఆనుకొని మండల పరిషత్ దుకాణాలు ఉన్నాయి. సాయిబాబా గుడి వైపు ఉన్న ఐదు షాపులను ఒక్కొక్క దాన్ని రూ.3,800 చొప్పున అద్దెకి ఇచ్చారు. ఆ ప్రాంతంలో ప్రైవేటు షాపుల అద్దెలు రూ.10 వేల వరకు ఉన్నాయి. మెయిన్ రోడ్డును ఆనుకొని నూకాలమ్మ తల్లి గుడి ఎదురుగా మూడు దుకాణాలు ఉండగా, ఒక్కొక్కటి రూ.4,800 చొప్పున అద్దెకు ఇచ్చారు. ఈ షాపులకు ఆనుకొని మరో ఆరు దుకాణాలను కేవలం రూ.1,750లకు అద్దెకు ఇచ్చారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు దుకాణాలకు రూ.20 వేలు నుంచి రూ.30 వేలు వరకు అద్దెలు ఉన్నాయి. ఇందిరా మార్కెట్‌లోని లోపల దుకాణాలకు రూ. 2,230లు చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. బడ్డీలు, షెడ్లకు రూ.200, రూ.350 చొప్పున వసూలు చేస్తున్నారు. అయితే 2011లో దుకాణాలు పొందిన వ్యక్తులు వేరొకరికి అధిక అద్దెకు ఇచ్చినట్టు తెలిసింది. బహిరంగ వేలం పాట ద్వారా దుకాణాల కేటాయింపులు జరిగితే అద్దెల రూపంలో ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయం వచ్చేది.

భగ్గుమన్న భానుడు

... 5వ పేజీ తరువాయి

పడ్డారు.మధ్యాహ్నం వేళ రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. సాయంత్రం ఎండ తగ్గినా ఉక్కపోత వల్ల జనం విలవిల్లాడారు.

కోటవురట్లలో..

కోటవురట్ల: భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోయారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వడగాడ్పులు వీయడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ఉపాధి కూలీలు సైతం పనులను ఉదయం 10 గంటలకు ముగించుకొని ఇళ్లకు చేరుకోవాలని ఉపాధి హామీ పథకం అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం వేళ కోటవురట్ల మెయిన్ రోడ్డు నిర్మానుష్యంగా కనిపించింది.

నేడు ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు

నక్కపల్లి, ఏప్రిల్ 21: పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ ప్రధాన పార్టీల అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఇప్పటివరకూ ఈ నియోజకవర్గంలో ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి 11-30 గంటల మధ్య వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు, కూటమి టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అనిత నామినేషన్ దాఖలు చేస్తారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో అనితకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బి.ఫారం అందజేశారు.

వైభవంగా సాయిబాబా ఆలయం ప్రారంభం



సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

పరవాడ, ఏప్రిల్ 21 : మండలంలోని పి.బోనంగిలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయ ప్రారంభం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం 10.52 గంటలకు సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ, పసిడి కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నాయకులు బండారు రాజశేఖర్, రాయవరపు దేముడు, కేఆర్‌కే రాజు పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధనను ఏర్పాటు చేశారు.

జనసైనికులంతా కలిసి కట్టుగా పనిచేయాలి

అచ్యుతాపురం, ఏప్రిల్ 21: జనసైనికులంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ కమిటీ కార్యవర్గ సభ్యుడు సతీష్ కట్టింపూడి అన్నారు. ఎలమంచిలి రోడ్డులో గల ఒక కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన జనసైనికుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ గుర్తు గాజుగ్లాస్ నిరక్షరాస్యులకు కూడా తెలిసే విధంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈరిగల రమణ, కె.నాని, నెక్కల కృష్ణ, దువ్వాడ సూర్యప్రసాద్ పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్‌తో రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్

- కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గంగాధర్

కొత్తూరు, ఏప్రిల్ 21 : ఒక్క ఛాన్స్ అని అడిగి రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి ఐ.ఆర్. గంగాధర్ అన్నారు. ఆదివారం కృష్ణాపురం కాలనీలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత ఐదేళ్లలో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తీసుకురావడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమలో కాంగ్రెస్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎగ్గాడ భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో 50 మంది యువకులు చేరిక

కొత్తూరు, ఏప్రిల్ 21: అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామానికి చెందిన 50 మంది యువకులు జనసేన పార్టీలోకి ఆదివారం చేరారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో వీరందరికీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీశెట్టి సుధ, బొడ్డేడ భాస్కర్, బుద్ద సురేష్, దొడ్డి సురేష్, ఉదయ్, భాస్కర్, ఆడారి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో సమావేశమైన కూటమి నేతలు



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న దృశ్యం

కశింకోట, ఏప్రిల్ 21 : అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తనయుడు రిత్విక్ మండలంలోని బయ్యవరం, విస్సన్నపేట గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో నిరుద్యోగం ఎక్కువగా ఉందని, యువత భవిష్యత్తు బాగుండాలంటే కూటమి ప్రభుత్వం ఏర్పడాలని స్పష్టం చేశారు. గ్లాసు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిని, కమలం గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ నాయకుడు పొన్నగంటి అప్పారావు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'వైసీపీకి ఓటుతో గుణపాఠం చెప్పాలి'

రాంబిల్లి, ఏప్రిల్ 21: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసిందని, ఆపార్టీకి ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కశిరెడ్డి ప్రసాద్ కోరారు. ఆదివారం కృష్ణపాలెం పంచాయతీ శివారు నారప్పపాలెం గ్రామస్థులతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణంపాలెం పంచాయతీలో ఎస్ఈజెడ్ భూములిచ్చిన నిర్వాసితుల సమస్యలను వైసీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే పరిష్కరించలేదన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే నిర్వాసితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సంతు, నాయుడు, శ్రీను గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 21 : కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో ఆదివారం జరిగిన అఖిలభారత తపాలా, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సంఘం తొమ్మిదవ వార్షిక మహాజనసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు, ఉద్యోగులు, కర్షకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ మహాజనసభలో సీహెచ్.సూర్యనారాయణ, కె.రాజారావు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా హైపర్ ఆది ప్రచారం

మునగపాక(తుమ్మపాల), ఏప్రిల్ 21: మండలంలోని నాగులాపల్లి, ఒంపోలు, అరబుపాలెం, మునగపాక గ్రామాల్లో ఆదివారం జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గాజుగ్లాస్, కమలం గుర్తులపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన ఎలమంచిలి అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు రాజేష్, నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, యల్లపు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బండారు' నామినేషన్

» భారీ ఏర్పాట్లు చేపడుతున్న టీడీపీ » హాజరు కానున్న కూటమి శ్రేణులు


బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల రూరల్, ఏప్రిల్ 21 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మాడుగుల అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ఇక్కడ నామినేషన్ వేయనున్నారు. ఇందుకు సంబంధించి ఆ పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు చేతులమీదుగా బండారు ఆదివారం బి.ఫారం అందుకోవడంతో పలువురు పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు సోమవారం ఉదయం పది గంటలకు కేజే పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకోనున్నారు. అనంతరం ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు చేరుకుని అక్కడి నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా మాడుగుల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు సీఎం సురేశ్‌నాయుడు, పుప్పాల అప్పలరాజు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

» జిల్లా వ్యాప్తంగా 1998 మంది దరఖాస్తులు » 1659 మంది హాజరు


వేములపూడి మోడల్ స్కూల్‌లో పరీక్ష నిర్వహణను తనిఖీ చేస్తున్న అధికారిణి

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 21 : మండలంలోని వేములపూడి ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 768 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా, 623 మంది పరీక్ష రాశారు. వివిధ కేటగిరీల ద్వారా వంద సీట్ల భర్తీకి సంబంధించి ఈ పరీక్ష నిర్వహించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హత పరీక్ష నిర్వహించినట్టు చెప్పారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 1998 విద్యార్థులు దరఖాస్తులు చేయగా, 1659 మంది ప్రవేశ పరీక్షకు హాజరైనట్టు వివరించారు.

మంచాల మోడల్ స్కూల్‌లో...



చీడికాడ : మంచాల మోడల్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 148మంది విద్యార్థులు హాజరైనట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి తెలిపారు. ఐదో తరగతి పాసై ఆరో తరగతిలో చేరేందుకు 200మంది దరఖాస్తులు చేసుకోగా, 52మంది గైర్హాజరైనట్టు చెప్పారు. పాఠశాలలో 80 సీట్లు భర్తీకి సంబంధించి ఈ పరీక్ష నిర్వహించామన్నారు. నిబంధనల మేరకు సీట్ల కేటాయింపు ఉం టుందని వివరించారు.

పట్టణానికి పండగ శోభ


విద్యుద్దీపాలంకరణలో మరిడి మహాలక్ష్మి ఆలయం


నర్సీపట్టణంలోని మెయిన్ రోడ్డులో విద్యుత్ లైట్ల ధగధగలు



అబీద్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ సెట్టు, వినాయక ఆలయం ఎల్‌ఈడీ బోర్డు

నర్సీపట్నం, ఏప్రిల్ 21 : ఏ ఇంట చూసినా బంధుగణం.. ఈ వీధి చూసినా విద్యుత్ కాంతులతో ధగధగలు.. ఏ జంక్షన్ చూసినా కనువిందు చేసే హోర్డింగ్‌లు.. ఇవీ నర్సీపట్నంలో ఆదివారం కనిపించిన దృశ్యాలు. మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగ సోమవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా పట్టణం కొంగొత్త శోభను సంతరించుకుంది. అబీద్ సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్ వరకు, అమ్మవారి గుడి నుంచి పోలీస్ స్టేషన్ వరకు రోడ్లకు ఇరువైపులా విద్యుద్దీపాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. అబీద్ సెంటర్‌లో దుర్గమ్మ ఆకారంతో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ హోర్డింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

» రౌడీషీటర్లకు సీఐ కాంతికుమార్ హెచ్చరిక


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ కాంతికుమార్

నర్సీపట్నం, ఏప్రిల్ 21 : పట్టణంలో మరిడి మహాలక్ష్మి పండగ సందర్భంగా ఎటు వంటి అల్లర్లు, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లకు సీఐ కాంతికుమార్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం ఇక్కడ ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. అమ్మవారి జాగరణ, పండగ సందర్భంగా గొడవల్లో కనిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, అల్లర్లు, గొడవలలో కనిపించినా పీడీ యాక్ట్ తెరుస్తామన్నారు. ఎస్ఐలు సుధాకరరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

'బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి'


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘువర్మ

మాకవరపాలెం, ఏప్రిల్ 21 : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాల్సిందిగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ అన్నారు. మండలంలోని గిడుతూరు గ్రామంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య అందుతుందన్న విషయం పిల్లల తల్లిదండ్రులకు తెలపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు ఎన్. శ్రీరామ్మూర్తి, సత్యారావు, శేషగిరిరావు, రమేష్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను ఒకేసారి చెల్లిస్తే

ఐదు శాతం రాయితీ

నర్సీపట్నం, ఏప్రిల్ 21 : మునిసిపాలిటీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఒకేసారి చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఇస్తున్నారు. గత నెల పాత బకాయిలపై వడ్డీ రాయితీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 30వ తేదీలోగా రెండు అర్ధ సంవత్సరాల ఆస్తి పన్ను ఒకేసారి చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ వర్తిస్తుందని మునిసిపల్ కమిషనర్ రవిబాబు ఆదివారం తెలిపారు. మునిసిపాలిటీలోని 28 వార్డులలో 13,944మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.6.67 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా సంవత్సరం పన్ను ఒకేసారి చెల్లించి రాయితీ పొందాలని కోరారు.

నేడు శివాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ

మాడుగుల, ఏప్రిల్ 21 : మండల కేంద్రం మాడుగుల శివారులో గల ఉమా భీమలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఇందులో భాగంగా గత రెండు రోజులుగా విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. 101 మంది వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ వేడుక జరగనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 21 : విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు అందినట్టు రూరల్ ఎస్ఐ టి.రామారావు ఆదివారం తెలిపారు. మండలంలోని గురందొరపాలేనికి చెందిన విద్యార్థిని నర్సీపట్నంలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిందన్నారు. ఈ నెల 17వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళతానని చెప్పి రాకపోవడంతో మేనమామ ముమ్మిన శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వలంటీర్ల

రాజీనామాలు పెద్ద డ్రామా..

» టీడీపీ వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 21 : గ్రామ వలంటీర్ల రాజీనామాలు పెద్ద డ్రామా అని టీడీపీ వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్ ఆరోపించారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ వడ్డాదిలోని రెండు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 52 మంది వలంటీర్లు ఈ నెల 18న తమ పదవులకు రాజీనామా చేసినట్టు ప్రకటించారన్నారు. అయితే రాజీనామాలు ఎంపీడీవో కార్యాలయానికి చేరలేదన్నారు. జిల్లాలో 'మేమంతా సిద్ధం' పేరిట సీఎం నిర్వహించిన సభకు స్థానిక వలంటీర్లు ఆదివారం పెద్దఎత్తున జన సమీకరణ చేశారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకూడదని ఎన్నికల నియమావళి ఉంది కాదా.. అని ప్రశ్నిస్తే, తాము పదవులకు రాజీనామాలు చేశామని వారు తెలిపారన్నారు. వలంటీర్ల రాజీనామాలపై ఎంపీ డీవో కార్యాలయంలో అడగ్గా, తమకు వలంటీర్ల రాజీనామా పత్రాలు అందలేదని వారు తెలిపారన్నారు. రాజీనామాలు చేయకుండానే చేశామని ఎన్నికల అధికారులను తప్పుదోవ పట్టించి, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న వలంటీర్లపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మోదకొండమ్మకు విశేష పూజలు



మాడుగుల, ఏప్రిల్ 21 : వరాల తల్లి మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి భక్తుల రాక ఆరంభమైంది. న్యాయవాది శ్రీనాథ ప్రసాదరావు, ప్రమోద్‌లు భక్తుల కోసం అన్నసమారాధన జరిపారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'రూ.50 వేలు దాటితే ఆధారాలు చూపాలి'

రోలుగుంట, ఏప్రిల్ 21 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీలను ముమ్మరం చేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఆదివారం ఇక్కడ పలుచోట్ల వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనచోదకులతో ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా రూ.50వేలు దాటి నగదు వెంట తీసుకువెళితే ఆధారాలు పక్కాగా చూపించాల్సి ఉంటుందన్నారు.

అయ్యన్నకు మద్దతుగా ప్రచారం

నాతవరం, ఏప్రిల్ 21 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న అయ్యన్నపాత్రుడును గెలిపిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు కె.నూకరాజు అన్నారు. అప్పన విజయ్ తదితరులతో కలిసి చమ్మచింతలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు.

భగ్గుమన్న భానుడు

... 5వ పేజీ తరువాయి

పడ్డారు. మధ్యాహ్నం వేళ రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. సాయంత్రం ఎండ తగ్గినా ఉక్కపోత వల్ల జనం విలవిల్లాడారు.

కోటవురట్ల: భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోయారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వడగాడ్పులు వీయడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ఉపాధి కూలీలు సైతం పనులను ఉదయం 10 గంటలకు ముగించుకొని ఇళ్లకు చేరుకోవాలని ఉపాధి హామీ పథకం అధికారులు చెబుతున్నారు.

ఎండ మండే..


మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న సమయంలో మాకవరపాలెం మెయిన్ రోడ్డు

మాకవరపాలెం/ చోడవరం, ఏప్రిల్ 21 : ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఇంట్లో ఉన్నా.. వీధిలోకి వెళ్లినా చెమటలు ఆగడం లేదు. ఆదివారం మాకవరపాలెంలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం బెంబేలెత్తిపోయారు. మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతంలో చాలావరకు రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. ఇదిలావుంటే, చోడవరం పరిసర మండలాల్లో భానుడు భగభగమండడంతో జనం అల్లాడిపోయారు. ఇప్పుడే ఇలా ఉంటే.. మున్ముందు కార్తెల్లో పరిస్థితి ఏమిటని అంతా ఆందోళన చెందుతున్నారు.

వాన కురిసె..


కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో వర్షం కురుస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట/ రావికమతం, ఏప్రిల్ 21 : గత వారం రోజులుగా ఉష్ణతాపంతో అల్లాడితున్న గొలుగొండ, రావికమతం మండలాల ప్రజలపై ఆదివారం వరుణుడు కరుణ చూపాడు. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు. ఈ వర్షం జీడిమామిడి పంటలకు ఎంతగానో మేలు చేస్తుందని ఆయా రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి వనరులపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

పట్టించుకోలేదు. దీంతో సాగునీరు అందక రైతులు అల్లాడిపోతున్నారు.

మాకవరపాలెం సర్పానదిలో (పిరుకుమదుం)కు ఉన్న ఏటి కాలువ గ్రోయిన్ గేట్లు ఐదేళ్ల క్రితం మరమ్మతులకు గురయ్యాయి. ఈ కాలువ గుండా పైడిపాల, మాకవరపాలెం, తామరం, నారాయణరాజుపేట, జి.కోడూరు గ్రామాల్లో ఉన్న సుమారు 800 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే ఈ కాలువకు ఉన్న గేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గేట్లు విరిగిపోయి కాలువలో కూరుకుపోవడంతో సాగునీరు రావడం లేదు. గత ఏడాది సర్పానదిలో నీరు ఉన్నా కాలువ గుండా పొలాలకు నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోయాయి. దీని వల్ల రైతులు నష్టపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రోయిన్ గేట్లు బాగు చేయించడంతో పాటు కాలువలో పూడికలు తీయాలని రైతులు కోరుతున్నారు.

ఐదేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం



ఏటికాలువ గ్రోయిన్ గేట్లు మరమ్మతులకు గురికావడంతో వరిసాగు చేసేందుకు ఐదేళ్లుగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. గేట్లు విరిగిపోయి కాలువలో కూరుకు పోవడంతో నీరు రావడం లేదు. దీని వల్ల చాలా నష్టపోతున్నాం.

- పంచదార్ల ఏసుబాబు, మాకవరపాలెం

చప్పగా జగన్ రోడ్‌షో

... 5వ పేజీ తరువాయి

రావడానికి గంట ముందు నుంచే వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

ప్రసంగం లేకుండా

అభివాదాలతోనే ముగిసిన రోడ్‌షో

సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదివారం నగరంలో నిర్వహించిన రోడ్‌షోను ప్రసంగం లేకుండా కేవలం అభివాదాలతోనే ముగించేశారు. పెందుర్తి నియోజకవర్గంలో మొదలైన ఆయన బస్సు యాత్ర విశాఖ పశ్చిమ, ఉత్తరం, దక్షిణం, తూర్పు నియోజకవర్గాల మీదుగా భీమిలి నియోజకవర్గంలో ముగిసింది. అయితే సీఎం జగన్ కొన్నిచోట్ల బస్సుపై నిలబడి, మరికొన్నిచోట్ల లోపల కూర్చొని ప్రజలకు అభివాదం/నమస్కారం చేశారు తప్ప ఎక్కడ ఉపన్యసించలేదు. రెండు, మూడుచోట్ల బస్సు ఆపి వివిధ వర్గాలకు చెందినవారి నుంచి వినతి పత్రాలు అందుకున్నారు. కానీ ఎక్కడా ప్రజలను ఉద్దేశించి మాట్లాడకపోవడం, తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కనీసం కోరకపోవడం పార్టీ నేతలను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది.

లోకాయుక్త ఆదేశాలు బేఖాతరు

... 5వ పేజీ తరువాయి

చేతులు దులుపుకున్నారు. షాపులు ఖాళీ చేయమన్నా చేయడం లేదని అధికారులు చేతులెత్తేశారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

బహిరంగ వేలం పాట నిర్వహించి దుకాణాలు కేటాయించి ఉంటే ప్రభుత్వానికి ఆదాయం వచ్చి ఉండేది. అయితే ఇష్టారాజ్యంగా పాలక వర్గం దుకాణాలను కేటాయించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. ఇందిరా మార్కెట్ లోపల, సాయిబాబా గుడి రోడ్డు, మెయిన్ రోడ్డును ఆనుకొని మండల పరిషత్ దుకాణాలు ఉన్నాయి. సాయిబాబా గుడి వైపు ఉన్న ఐదు షాపులను ఒక్కొక్క దాన్ని రూ.3,800 చొప్పున అద్దెకి ఇచ్చారు. ఆ ప్రాంతంలో ప్రైవేటు షాపుల అద్దెలు రూ.10 వేల వరకు ఉన్నాయి. మెయిన్ రోడ్డును ఆనుకొని నూకాలమ్మ తల్లి గుడి ఎదురుగా మూడు దుకాణాలు ఉండగా, ఒక్కొక్కటి రూ.4,800 చొప్పున అద్దెకు ఇచ్చారు. ఈ షాపులకు ఆనుకొని మరో ఆరు దుకాణాలను కేవలం రూ.1,750లకు అద్దెకు ఇచ్చారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు దుకాణాలకు రూ.20 వేలు నుంచి రూ.30 వేలు వరకు అద్దెలు ఉన్నాయి. ఇందిరా మార్కెట్‌లోని లోపల దుకాణాలకు రూ. 2,230లు చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. బడ్డీలు, షెడ్లకు రూ.200, రూ.350 చొప్పున వసూలు చేస్తున్నారు. అయితే 2011లో దుకాణాలు పొందిన వ్యక్తులు వేరొకరికి అధిక అద్దెకు ఇచ్చినట్టు తెలిసింది. బహిరంగ వేలం పాట ద్వారా దుకాణాల కేటాయింపులు జరిగితే అద్దెల రూపంలో ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయం వచ్చేది.


ఇందిరా మార్కెట్